మూడో దశ నామినేషన్ల ప్రక్రియ షురూ

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల మూడో దశ నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. 12 రాష్ట్రాల్లో మే 7న పోలింగ్ జరిగే 97 స్థానాలకు గాను ఈసీ నోటిఫికేషన్ జారీ చేసింది. నామినేషన్లు దాఖలుకు ఈ నెల 19 ఆఖరు తేదీ. ఇటీవల వాయిదాపడ్డ మధ్యప్రదేశ్‌లోని బేతుల్ నియోజకవర్గ ఎన్నిక కోసం ఈసీ మరో నోటిఫికేషన్ ఇచ్చింది. అస్సాం, బీహార్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటక, యూపీ, పశ్చిమ బెంగాల్, జమ్ము కశ్మీర్ రాష్ట్రాల్లో మూడో దశలో ఎన్నికలు జరగనున్నాయి.

నామినేషన్ పత్రాల ఏకపక్ష తిరస్కరణపై సుప్రీంలో పిటిషన్

న్యూఢిల్లీ: అభ్యర్థుల నామినేషన్ పత్రాలను తిరస్కరించడంలో రిటర్నింగ్ అధికారులు(ఆర్వో) విచక్షణ రహితంగా వ్యవహరించకుండా ఈసీని ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. బీహార్‌లోని బంకా పార్లమెంట్ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన జవహర్‌కుమార్ నామినేషన్‌ను ఆర్వో తిరస్కరించారు. దీనిని ఆయన సవాలు చేస్తూ సుప్రీంను ఆశ్రయించారు. నామినేషన్ పత్రాల్లో లోపాలను సరిచేసేందుకు అభ్యర్థికి ఒక రోజన్నా కేటాయించేలా ఈసీని ఆదేశించాలని సుప్రీంకోర్టును అభ్యర్థించారు.

ఇద్దరి ఓట్ల కోసం అడవిలో 107 కి.మీ. ప్రయాణం

గడ్చిరోలి జిల్లాలో ఈసీ అధికారుల అంకితభావం

గడ్చిరోలి: అడవిలో ఉన్న ఇద్దరు వయోజనులు తమ ఓటు హక్కు వినియోగించుకొనేందుకు మహారాష్ట్ర ఈసీ అధికారులు సంపూర్ణ సహకారం అందించారు. అహెరి-సిరోంచా మార్గంలోని దట్టమైన అడవిలో 107 కిలోమీటర్లు ప్రయాణించి వాళ్ల ఇంటి వద్దే ఓటును నమోదు చేశారు. గడ్చిరోలి-చిమూర్ లోక్‌సభ నియోజకవర్గంలోని వందేండ్ల కిష్టయ్య మదరబోయిన, 86 ఏండ్ల కిష్టయ్య కొమెర అనే ఇద్దరు ఓటర్ల కోసం అధికారులు ఈ పని చేశారని ఈసీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది.

అంబేద్కర్ తిరిగొచ్చినా..

రాజ్యాంగాన్ని రద్దు చేయలేరు!

విపక్షాల విమర్శలపై మోదీ

న్యూఢిల్లీ: బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే.. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని, రాజ్యాంగాన్ని మార్చేస్తారని విపక్షాలు చేస్తున్న విమర్శలపై ప్రధాని మోదీ స్పందించారు. నాగ్‌పుర్ జిల్లాలో జరిగిన ర్యాలీలో మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వానికి రాజ్యాంగం సర్వస్వం అని చెప్పుకొచ్చిన మోదీ.. అంబేద్కర్ తిరిగివచ్చినా ఆయన రాజ్యాంగాన్ని రద్దు చేయలేరని పేర్కొన్నారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేసినందుకు అంబేద్కర్ ఆత్మ తనను ఆశీర్వదిస్తుందన్నారు. దేశంలో ఎమర్జెన్సీ విధించడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వమే రాజ్యాంగాన్ని నాశనం చేసే ప్రయత్నాలు చేసిందన్నారు.

స్వింగ్ స్టేట్స్ మొగ్గు ఎటో?

అమెరికాలో ఏడు స్వింగ్ స్టేట్స్ ఉన్నాయి. దేశాధ్యక్ష ఎన్నికల్లో ఈ రాష్ట్రాలు డెమొక్రటిక్ పార్టీ వైపునో లేదంటే రిపబ్లికన్ పార్టీ వైపునో ఏకపక్షంగా మొగ్గుచూపుతూ ఉంటాయి. అధ్యక్ష ఎన్నికల ఫలితాలను నిర్ణయించడంలో ఈ రాష్ట్రాలే కీలకం. మన దేశంలోనూ లోక్‌సభ ఫలితాలను తారుమారు చేయగల మూడు స్వింగ్ స్టేట్స్ ఉన్నాయి. అవి. మహారాష్ట్ర, బీహార్, పశ్చిమబెంగాల్.

- ఎన్నికల్లో కీలకంగా మహారాష్ట్ర, బీహార్, పశ్చిమ బెంగాల్
- మొత్తం లోక్‌సభ స్థానాల్లో పావు వంతు ఈ రాష్ట్రాల నుంచే
- గత ఎన్నికల్లో మూడింటా ఎన్డీఏకు గణనీయ ఫలితాలు
- ఈసారి మాత్రం గట్టి పోటీ ఎదుర్కొంటున్న కమలదళం
- మోదీని గద్దె దించాలంటే ఇక్కడ నిలువరించాల్సిందే
- ఇండియా కూటమికి అసలు పరీక్ష ఈ మూడు రాష్ట్రాల్లోనే
- సర్వేల అంచనాలకు సైతం అందని ప్రజాభిప్రాయం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: లోక్‌సభ ఎన్నికల్లో గెలిచి మూడోసారి కూడా అధికారం చేపట్టాలనేది ఎన్డీఏ పట్టుదల. ఎలాగైనా మోదీని గద్దె దించాలనేది ఇండియా కూటమి కల. ఈ హోరాహోరీ పోరులో ఎవరి లక్ష్యం నెరవేరుతుందో నిర్ణయించే కీలక రాష్ట్రాలు బీహార్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్. ఈ మూడు రాష్ట్రాల్లో 130 స్థానాలు ఉన్నాయి. అంటే, మొత్తం లోక్‌సభ స్థానాల్లో దాదాపు పావు వంతు స్థానాలు ఈ మూడు రాష్ట్రాలవే. ఈ మూడు రాష్ట్రాల్లో కనుక ఎన్డీఏను నిలువరించగలిగితే మోదీని గద్దె దించే లక్ష్యాన్ని ఇండియా కూటమి సగం చేరుకున్నట్టే. ఈ రాష్ట్రాల్లో కనుక గత ఎన్నికల్లో సాధించిన ఫలితాలను పునరావృతం చేస్తే మూడోసారి కూడా అధికారం చేపట్టేందుకు మోదీకి మార్గం సుగమం అయినట్టే. అందుకే ఇరుపక్షాలూ ఈ మూడు రాష్ట్రాలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ప్రజాభిప్రాయం ఏంటో సర్వేలకు, రాజకీయ పండితుల అంచనాలకూ అందడం లేదు.

బెంగాల్‌లో ఇండియా కూటమి విచ్ఛిన్నం

42 సీట్లున్న పశ్చిమ బెంగాల్‌లో ఏడు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఇక్కడ బీజేపీ, తృణమూల్ కాంగ్రెస్ పార్టీలు ఒంటరిగా బరిలో నిలవగా కాంగ్రెస్, కమ్యూనిస్టులు కూటమిగా పోటీ చేస్తున్నాయి. అయితే, 2014 తర్వాత బెంగాల్‌లో వేగంగా ఎదిగిన బీజేపీ.. కాంగ్రెస్, కమ్యూనిస్టుల ఓటుబ్యాంకును తన వైపు తిప్పుకున్నది. దీంతో మెజారిటీ స్థానాల్లో ఇప్పుడు బీజేపీ - తృణమూల్ కాంగ్రెస్ మధ్యనే హోరాహోరీ పోరు సాగుతున్నదని సర్వేలు చెప్తున్నాయి. గత ఎన్నికల్లో ఇక్కడ తృణమూల్ కాంగ్రెస్ 22, బీజేపీ 18, కాంగ్రెస్ రెండు స్థానాలు గెలిచాయి. ఇక్కడ సీట్ల పంపిణీ కుదరక ఇండియా కూటమి విచ్ఛిన్నం కావడం బీజేపీకి కలిసి వచ్చే అవకాశం ఉంది. 2014 ఎన్నికల్లో 17 శాతం ఓట్లు సాధించిన బీజేపీ 2019 ఎన్నికల నాటికి 40 శాతానికి పెరిగింది. ఈ ఓట్లను కనుక బీజేపీ కాపాడుకోగలిగితే ఆ పార్టీ మంచి స్థానాలను సాధించుకునే అవకాశముంది. అయితే, బీజేపీకి ఇక్కడ వ్యవస్థాపక బలం లేదు. పార్టీలో సువేందు అధికారి, దిలీప్ ఘోష్, సుకంత మజుందర్ నేతృత్వంలో మూడు వర్గాలు ఉండటం ఆ పార్టీకి మైనస్. ఇక, రాష్ట్రంలో దాదాపు 30 శాతం వరకు ఉన్న మైనారిటీ ఓట్లు తృణమూల్ కాంగ్రెస్‌కు ప్రధాన బలం. అయితే కాంగ్రెస్, కమ్యూనిస్టులు వేరుగా పోటీ చేస్తుండటంతో ఈ ఓట్లు చీలితే మాత్రం ఆ పార్టీకి మైనస్ కావచ్చు.

బీహార్‌లో ఈసారి ఎన్డీఏకు 'సాలీ'యేనా ?

గత రెండు ఎన్నికల్లోనూ ఎన్డీఏ వైపు నిలిచిన బీహార్‌లో ఈసారి గట్టి పోటీ నెలకొన్నది. 2019 ఎన్నికల్లో నితీశ్ కుమార్ సారథ్యంలోని జేడీయూతో కలిసి పోటీ చేసిన బీజేపీ ఏకంగా 40 స్థానాలకు గానూ 39 స్థానాలను దక్కించుకుంది. తర్వాత కొంతకాలం నితీశ్ ఇండియా కూటమితో కలిసి మళ్లీ ఎన్డీఏలోకి చేరిపోయారు. ఇలా కూటములు మార్చడం వల్ల నితీశ్‌పై ప్రజల్లో విశ్వసనీయత తగ్గిందనే అంచనాలు ఉన్నాయి. నితీశ్ సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వంపై, బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత కూడా బీహార్‌లో ఎన్డీఏ ఓట్లను తగ్గించవచ్చు. అయితే, నితీశ్ కుమార్‌కు రాష్ట్రంలో 36 శాతం ఉన్న ఈబీసీ ఓటర్లలో బలం ఉండటం బీజేపీకి కలిసిరావచ్చు. దళితుల్లో మంచి ఆదరణ ఉన్న చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ(రామ్ విలాస్) కూడా కూటమిలో ఉండటం ఎన్డీఏకు మేలు చేయవచ్చు. మరోవైపు కమ్యూనిస్టులు కలిసి రావడం, ముస్లిం-బీసీ ఓటుబ్యాంకు ఇండియా కూటమికి అనుకూలంగా మారే అవకాశం ఉంది. ఇక, బీహార్‌లో ఇండియా కూటమికి ప్రధాన బలంగా ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ కనిపిస్తున్నారు. మొత్తంగా గత ఎన్నికల్లో లాగా ఈసారి బీహార్‌లో ఏకపక్ష ఫలితాలను సాధించడం ఎన్డీఏ కూటమికి అంత సులువు కాదనేది విశ్లేషకుల అభిప్రాయం.

మహారాష్ట్రలో మెజారిటీ స్థానాలు ఎవరికో ?

దేశంలో ఉత్తరప్రదేశ్ తర్వాత అత్యధిక లోక్‌సభ స్థానాలు ఉన్నది మహారాష్ట్రలోనే. 2019 ఎన్నికల్లో ఇక్కడి 48 స్థానాల్లో ఎన్డీఏ కూటమి 41 సీట్లు దక్కించుకుంది. అయితే, తర్వాతి కాలంలో వేగంగా పరిణామాలు మారాయి. శివసేన ఎన్డీఏను వీడి కాంగ్రెస్, ఎన్సీపీతో జట్టు కట్టింది. తర్వాత శివసేనను ఏక్‌నాథ్ షిండే, ఎన్సీపీని అజిత్ పవార్ చీల్చడం, వీరిద్దరూ బీజేపీతో కలవడం వేగంగా జరిగిపోయాయి. ఇప్పుడు ఎన్డీఏలో బీజేపీ, శివసేన(ఏక్‌నాథ్ షిండే), ఎన్సీపీ(అజిత్ పవార్) ఉన్నాయి. ఇండియా కూటమిగా కాంగ్రెస్, శివసేన(ఉద్ధవ్ ఠాక్రే), ఎన్సీపీ(శరద్ పవార్) కలిసి పోటీ చేస్తున్నాయి. ఈసారి రెండు కూటముల మధ్య హోరాహోరీ పోటీ ఉన్నదని అన్ని సర్వేలు చెప్తున్నాయి. దీంతో అప్రమత్తమైన బీజేపీ.. మరింత బలం పెంచుకునేందుకు రాజ్ ఠాక్రే నేతృత్వంలోని ఎంఎన్ఎస్‌ను కలుపుకున్నది. దశాబ్దాలుగా మహారాష్ట్ర నేలపై ప్రభావం చూపిన శివసేన, ఎన్సీపీ చీలికకు కారణమనే అపప్రథ బీజేపీకి ఈ ఎన్నికల్లో ప్రతికూలంగా మారవచ్చు. మరాఠాలకు 10 శాతం కోటా కల్పిస్తూ షిండే ప్రభుత్వం బిల్లు తీసుకొచ్చినప్పటికీ హైకోర్టులో పెండింగ్ లో పడటంతో మరాఠాలను ఆకర్షించాలనుకున్న వ్యూహం ఫలించలేదు. మరోవైపు ఈ బిల్లు తమకు నష్టం చేస్తుందని భావిస్తున్న ఓబీసీలు కూడా వ్యతిరేకం అయ్యారు.

మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికల్లో పార్టీలు సాధించిన సీట్లు

పార్టీ	2014	2019
బీజేపీ	23	23
శివసేన (అవిభాజ్య)	18	18
ఎన్సీపీ	04	04
కాంగ్రెస్	02	01
స్వాభిమాణి పక్ష	01	00
ఎంఐఎం	00	01
స్వతంత్రులు	00	01

బెంగాల్‌లో లోక్‌సభ ఎన్నికల్లో పార్టీలు సాధించిన సీట్లు

పార్టీ	2014	2019
తృణమూల్	34	22
బీజేపీ	02	18
కాంగ్రెస్	04	02
సీపీఎం	02	00

బీహార్‌లో లోక్‌సభ ఎన్నికల్లో పార్టీలు సాధించిన సీట్లు

పార్టీ	2014	2019
బీజేపీ	22	17
ఎల్జేపీ	06	06
ఆర్ఎస్ఎల్పీ	03	00
జేడీయూ	02	16
ఆర్జేడీ	04	00
కాంగ్రెస్	02	01
ఎన్సీపీ	01	00

అది చట్టాన్ని ఉల్లంఘించడమే

- ఈవీఎంలపై ఆర్టీఐ దరఖాస్తుకు ఎందుకు జవాబివ్వలేదు?
- రాతపూర్వక వివరణ ఇవ్వండి
- ఈసీకి సీఐసీ ఆదేశం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: ఈవీఎంలపై ఆర్టీఐ కింద సమాచారం ఇచ్చేందుకు ఎన్నికల సంఘం నిరాకరించడంపై కేంద్ర సమాచార కమిషన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇది చట్టాన్ని ఉల్లంఘించడమేనంటూ ఈసీ తీరును తప్పుబట్టింది. దీనిపై వివరణ ఇవ్వాలని కేంద్ర ఎన్నికల సంఘానికి సీఐసీ తాజాగా ఆదేశాలు జారీచేసింది. రెండేండ్ల క్రితానికి సంబంధించిన ఈ కేసు రికార్డులు, వాదనలను పరిశీలించిన తర్వాత.. ఓ ఆర్టీఐ దరఖాస్తు కింద చట్ట ప్రకారం 30 రోజుల్లోగా స్పందించకుండా నిబంధనలను ఉల్లంఘించినందుకు రాతపూర్వక వివరణ ఇవ్వాలని ఇప్పటి ఈసీ సెంట్రల్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారి ద్వారా అప్పటి పీఐవోను ఆదేశించినట్టు కేంద్ర సమాచార కమిషనర్ హీరాలాల్ సమారియా తెలిపారు. ఈ ఉల్లంఘనకు ఇంకెవరైనా బాధ్యులు ఉంటే వారికి కూడా తమ ఆదేశాల కాపీని అందజేయాలని, వారు కూడా సీఐసీకి సమాధానం ఇచ్చేలా చూడాలని సీపీఐవోను సీఐసీ ఆదేశించారు. ఎన్నికల సమయంలో ఉపయోగించే ఈవీఎంలు, వీవీప్యాట్ మిషన్ల విశ్వసనీయతపై పలు ప్రశ్నలు లేవనెత్తుతూ పలువురు మాజీ సివిల్ సర్వెంట్లు, ఐఐటీ, ఐఎంఎంల ప్రొఫెసర్లు, టెక్ నిపుణులు, విద్యావేత్తలు 2022, మే 2న ఈసీకి లేఖ రాశారు. కాగా, ఈ రిప్రజంటేషన్‌పై ఏం చర్యలు తీసుకొన్నారో తెలుపాలని కోరుతూ మాజీ ఐఏఎస్ ఎంజీ దేవసహాయం ఆర్టీఐ కింద అదే ఏడాది నవంబర్ 22న దరఖాస్తు చేశారు.

అప్పీల్‌ను పట్టించుకోని ఈసీ అధికారులు

తమ రిప్రజంటేషన్‌ను ఎవరికి పంపారు? తాము లేవనెత్తిన అంశంపై సమావేశాల్లో చర్చించారా? తదితర వివరాలను తెలియజేయాలని కోరుతూ దేవసహాయం ఆర్టీఐ కింద దరఖాస్తు చేశారు. అయితే 30 రోజుల తప్పనిసరి పీరియడ్‌లోగా ఈసీ నుంచి ఆయనకు సమాధానం రాలేదు. దీంతో దేవసహాయం చేసిన మొదటి అప్పీల్‌ను ఈసీ సీనియర్ అధికారులు పట్టించుకోలేదు. ఆ తర్వాత ఎన్నికల సంఘం నుంచి సమాధానం రాకపోవడంతో ఆయన సెకండ్ అప్పీల్ కోసం కేంద్ర సమాచార కమిషన్‌ను ఆశ్రయించారు. దేవసహాయం దరఖాస్తుకు ఎందుకు స్పందించలేదని సీఐసీ హీరాలాల్ సమారియా అడుగ్గా.. ఈసీ సెంట్రల్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారి(సీపీఐవో) నుంచి సంతృప్తికర సమాధానం రాలేదు.

శివమొగ్గలో బీజేపీకి రెబల్ పోటు

శివమొగ్గ: కర్ణాటక బీజేపీ తిరుగుబాటు నేత కేఎస్ ఈశ్వరప్ప శుక్రవారం శివమొగ్గ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. భారీ ఊరేగింపుతో వెళ్లి ఈశ్వరప్ప తన నామినేషన్‌ను దాఖలు చేశారు. నేటి నుంచి తమ కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తారని, బీజేపీలో తన లాంటి నమ్మకమైన కార్యకర్తలకు ఎలా అన్యాయం జరుగుతున్నదో వివరిస్తారని ఈశ్వరప్ప తెలిపారు. తండ్రీకొడుకుల చేతిలో బీజేపీ ఎలా బాధపడుతున్నదో వివరిస్తారన్న ఈశ్వరప్ప పరోక్షంగా మాజీ సీఎం యెడియూరప్ప, ఆయన కొడుకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బీవై విజయేంద్రను లక్ష్యంగా చేసుకుని విమర్శించారు. శివమొగ్గలో బీజేపీ అభ్యర్థిగా బీవై రాఘవేంద్ర పోటీలో ఉన్నారు.

బారాముల్లా బరిలో ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్: జమ్ముకశ్మీర్ మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. బారాముల్లా నియోజకవర్గం నుంచి ఆయన పోటీ చేయనున్నట్టు నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా ప్రకటించారు. ఉత్తర కశ్మీర్‌పై బీజేపీ ఎక్కువగా దృష్టి సారించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన వెల్లడించారు. బారాముల్లా పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 18 అసెంబ్లీ సెగ్మెంట్లున్నాయి. దీంతో ఇక్కడ పోటీ రసవత్తరంగా మారనున్నది. బీజేపీ కుట్రలు, ద్రోహం, రాజకీయ కుతంత్రాలకు వ్యతిరేకంగా తాను బరిలోకి దిగుతున్నానని వివరించారు. ఎన్‌సీకి ఒమర్ అబ్దుల్లా ఉపాధ్యక్షునిగా వ్యవహరిస్తున్నారు. 2009 తర్వాత లోక్‌సభ ఎన్నికల్లో ఒమర్ పోటీ చేస్తున్నారు.

ఢిల్లీలో రాష్ట్రపతి పాలనకు భారీ కుట్ర

కేంద్ర ప్రభుత్వంపై మంత్రి ఆతిశీ తీవ్ర ఆరోపణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ఢిల్లీ క్యాబినెట్ మంత్రి ఆతిశీ తీవ్ర ఆరోపణలు చేశారు. దేశ రాజధానిలో రాష్ట్రపతి పాలన విధించేందుకు కేంద్ర ప్రభుత్వం భారీ కుట్ర చేస్తున్నదని అన్నారు. శుక్రవారం ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వాన్ని కూల్చేందుకు రాజకీయ కుట్రతో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారని, రానున్న రోజుల్లో కేంద్రం ఢిల్లీలో రాష్ట్రపతి పాలన విధించనున్నట్టు విశ్వసనీయంగా తెలుస్తున్నదని చెప్పారు. కానీ, అది అక్రమం, ప్రజా తీర్పునకు విరుద్ధమని పేర్కొన్నారు. ఢిల్లీలో రాష్ట్రపతి పాలన విధించబోతున్నట్టు ఇటీవల చోటుచేసుకున్న పలు పరిణామాలు స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. ఢిల్లీలోని పలు విభాగాల్లో ఎన్నో పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ గత కొన్ని నెలలుగా ఒక్క సీనియర్ ఐఏఎస్ అధికారిని కూడా నియమించలేదని, ఉన్నతాధికారులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సాకుగా చూపుతూ మంత్రుల సమావేశాలకు హాజరు కావడం లేదని ఆతిశీ వివరించారు. దీనిపై బీజేపీ ఘాటుగా స్పందించింది. మొత్తం 70 సీట్లున్న ఢిల్లీ శాసనసభలో 62 మంది ఎమ్మెల్యేలను కలిగి ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీని రాష్ట్రపతి పాలన భయం వెంటాడుతుండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నదని ఢిల్లీ బీజేపీ శాఖ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ్ పేర్కొంటూ.. ఆతిశీ రోజుకో కొత్త కథ అల్లుతున్నారని విమర్శించారు. మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సర్వోదయ నాయకుడు మురారిలాల్ కన్నుమూత

న్యూఢిల్లీ: సామాజిక కార్యకర్త, సర్వోదయ, చిప్కో ఉద్యమాల నాయకుడు మురారి లాల్(91) శుక్రవారం రిషికేశ్‌లోని ఎయిమ్స్‌లో తుది శ్వాస విడిచారు. ఆయన తన జీవితమంతా సామాజిక సేవకే అంకితం చేశారు. చిప్కో ఉద్యమ నేత, పర్యావరణ వేత్త చండీ ప్రసాద్ భట్ సహా పలువురు సామాజిక కార్యకర్తలు లాల్ మృతికి సంతాపం తెలిపారు. మురారి లాల్ కృషిని ఉత్తరాఖండ్ ప్రభుత్వంతో పాటు దేశంలోని పలు ప్రఖ్యాత సంస్థలు గుర్తించి గౌరవించాయి.

హైకమాండ్ ఆదేశిస్తే వైదొలుగుతా!

కర్ణాటక సీఎం సిద్ధరామయ్య

మైసూరు, ఏప్రిల్ 12: ముఖ్యమంత్రి పదవిపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి పదవి విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయమే తనకు శిరోధార్యమని, పదవిలో కొనసాగమంటే కొనసాగుతానని, లేదంటే దిగిపోతానని ఆయన పేర్కొన్నారు. గత ఏడాది మే నెలలో కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ముఖ్యమంత్రి పదవి విషయంలో సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య తీవ్ర పోటీ నెలకొనగా మొదటి రెండున్నరేండ్లు సిద్ధరామయ్య, తర్వాత రెండున్నరేండ్లు డీకే శివకుమార్‌కు దక్కేలా ఒక అంతర్గత ఒప్పందం జరిగిందనే వార్తలు వచ్చాయి. దీని ప్రకారం రెండున్నరేండ్లు పూర్తైన తర్వాత డీకే శివకుమార్‌కు పదవి అప్పగిస్తారా అనే ప్రశ్నకు సిద్ధరామయ్య ఈ మేరకు సమాధానం ఇచ్చారు.

భారత్‌లో బ్రిటిష్ హైకమిషనర్‌గా లిండీ కామెరాన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: భారత్‌లో బ్రిటిష్ నూతన హైకమిషనర్‌గా లిండీ కామెరాన్ నియమితులయ్యారు. ఈ పదవి చేపట్టిన తొలి మహిళ ఆమే కావడం గమనార్హం. ఇండియా 1954లో తన మొదటి హై కమిషనర్‌గా విజయలక్ష్మీ పండిట్‌ను లండన్‌కు పంపిన 70 ఏండ్ల తర్వాత ఈ చారిత్రాత్మక నియామకం జరిగింది. విజయలక్ష్మీ పండిట్ భారత్ తొలి ప్రధాని నెహ్రూకు స్వయాన సోదరి. ఆమె 1961 వరకు లండన్‌లో హై కమిషనర్‌గా పనిచేశారు. లిండీ కామెరాన్ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి పట్టా పొందిన ప్రతిభాశాలి. గతంలో ఆమె యూకే నేషనల్ సైబర్ సెక్యూరిటీ సెంటర్‌కు సీఈవోగా పనిచేశారు.

రామేశ్వరం కేఫ్ పేలుడు..

మాస్టర్‌మైండ్, బాంబర్ అరెస్ట్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: బెంగళూరు రామేశ్వరం కేఫ్ బాంబు పేలుడు ఘటన ప్రధాన సూత్రధారితో సహా ఇద్దరు నిందితులను ఎన్ఐఏ అధికారులు శుక్రవారం పశ్చిమబెంగాల్‌లో అరెస్టు చేశారు. నిందితులు ముస్సావిర్ హుస్సేన్ సాజిబ్, అబ్దుల్ మథీన్ అహ్మద్ తాహా కోల్‌కతా సమీపంలో తప్పుడు గుర్తింపులతో దాక్కొని ఉండగా.. వారిని ఎన్ఐఏ బృందం గుర్తించిందని అధికారులు తెలిపారు. సాజిబ్ అనే వ్యక్తి కేఫ్‌లో ఐఈడీ పేలుడు పదార్థాన్ని అమర్చగా, ఈ ప్లాన్‌కు మాస్టర్ మైండ్ అబ్దుల్ మథీన్ అని పేర్కొన్నారు. ఎన్ఐఏ, కేంద్ర నిఘా సంస్థలు, పశ్చిమబెంగాల్, తెలంగాణ, కర్ణాటక, కేరళ పోలీసుల మధ్య సమన్వయంతో ఈ ఆపరేషన్ జరిగిందని తెలిపారు. గత నెల 1న రామేశ్వరం కేఫ్‌లో చోటుచేసుకొన్న పేలుడు ఘటనలో పలువురికి గాయాలైన విషయం తెలిసిందే.

తృణమూల్ మాజీ మంత్రి ఆస్తుల జప్తు

రూ.150 కోట్ల ఆస్తులు అటాచ్ చేసిన ఈడీ

న్యూఢిల్లీ: రేషన్ పంపిణీలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణల కేసులో పశ్చిమ బెంగాల్ మాజీ మంత్రి జ్యోతి ప్రియా మల్లిక్‌తో సహా మరో ఇద్దరి ఆస్తులను శుక్రవారం ఈడీ అటాచ్ చేసింది. సుమారు రూ.150 కోట్ల మేర ఆస్తులను అటాచ్ చేసింది. మాజీ మంత్రి మల్లిక్ తోపాటు అతని సహాయకుడు బాకీబుర్ రెహమాన్, టీఎంసీ నాయకుడు శంకర్ ఆద్యని కూడా దర్యాప్తు సంస్థ అరెస్ట్ చేసింది. ఈడీ అటాచ్ చేసిన ఆస్తులలో మల్లిక్ ఇల్లు, అతని సన్నిహితుల పేరిట ఉన్న అనేక ఇతర బినామీ ఆస్తులు, కోల్‌కతా, బెంగళూరులోని రెహమాన్‌కు చెందిన రెండు హోటళ్లు, వివిధ వ్యక్తులకు చెందిన 48 స్థిరాస్తులున్నాయి.

ఇరాన్ వార్ సైరన్

ఇజ్రాయెల్‌తో తీవ్రస్థాయికి ఉద్రిక్తతలు

- 48 గంటల్లో దాడులకు దిగొచ్చని మీడియాలో కథనాలు
- ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్న ఇజ్రాయెల్
- సంయమనం పాటించాలని ప్రపంచ దేశాల సూచన
- ఇరాన్, ఇజ్రాయెల్‌కు వెళ్లొద్దని పౌరులకు కేంద్రం అడ్వైజరీ

రెండు వారాల కిందట సిరియా రాజధాని డమాస్కస్‌పై జరిగిన వైమానిక దాడిలో ధ్వంసమైన ఇరాన్ దౌత్య కార్యాలయం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రమవుతున్నాయి. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. మరో 48 గంటల్లో ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడులకు దిగొచ్చన్న మీడియా కథనాలు ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-హమాస్ యుద్ధాలతో విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్న వేళ.. ఇరాన్ కూడా యుద్ధంలోకి దిగనుందనే వార్తలు భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి. రెండు వారాల కిందట సిరియా రాజధాని డమాస్కస్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయంపై ఇజ్రాయెల్ జరిపిన దాడిలో ఇరాన్ రెవల్యూషరీ గార్డ్స్‌కు చెందిన టాప్ జనరల్‌తో పాటు ఆరుగురు ఉన్నతాధికారులు మరణించడం తెలిసిందే. దీంతో ఇజ్రాయెల్‌పై ఇరాన్ పగతో రగలిపోతున్నది. దాడికి ప్రతీకారం తీర్చుకుంటామని ఇప్పటికే హెచ్చరించింది. ఇరాన్ దాడికి దిగొచ్చన్న వార్తల నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు.

సిద్ధంగా ఉన్నాం: ఇజ్రాయెల్ సైన్యం

తమ కాన్సులేట్‌పై దాడికి ప్రతీకారంగా 48 గంటల్లో ఇజ్రాయెల్‌పై ప్రత్యక్ష దాడులు చేసేందుకు ఇరాన్ సిద్ధమైందని ఇరాన్ నేత ఒకరిని ఉటంకిస్తూ వాల్‌స్ట్రీట్ జర్నల్ శుక్రవారం కథనం ఇచ్చింది. యుద్ధ విమానాలు సిద్ధంగా ఉన్నాయని, అయితే ఇజ్రాయెల్‌పై ప్రత్యక్ష దాడితో జరిగే రాజకీయ